
సాక్షి అనంతపురం

మంగళవారం ၊ 10 ၊ డిసెంబర్ ၊ 2024



చీనీ టన్ను రూ.37,280

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.37,280 పలికాయి.



టమాట కిలో రూ.20

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.2°/19.6°

జిల్లా అంతటా సోమవారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలి వాతావరణం నెలకొంది. ఆగ్నేయం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

రైతు సమస్యలపై పోరుబాట

- 13న వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో ర్యాలీ
- రైతులు తరలిరావాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు 'అనంత' పిలుపు



అనంతపురం ఎడ్యుకేషన్: రైతాంగ సమస్యలను విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ఎండగట్టేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు ఈనెల 13న అనంతపురంలో ర్యాలీ చేపట్టనున్నారు. ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని 'అనంత' పిలుపునిచ్చారు.

'సమగ్ర' ఉద్యోగులకు శుభవార్త

- డీఈఓకు ఏపీసీ ఎఫ్ఏసీ బాధ్యతలు

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష ఉద్యోగులకు శుభవార్త. నవంబరు జీతాలకు సంబంధించి బడ్జెట్ విడుదలైనా సమగ్ర శిక్ష ఏపీసీ లేనికారణంగా ఇప్పటిదాకా జీతాలు అందలేదు. రాష్ట్ర వ్యాప్తంగా 25 జిల్లాల్లోనూ సమగ్ర ఉద్యోగులకు జీతాలు పడ్డాయి. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా తయారైన ఇక్కడి పరిస్థితిపై ఈనెల 8న 'సాక్షి'లో 'జీతాలు ఇవ్వండి మహాప్రభో' శీర్షికన కథనం వెలువడింది. దీనిపై కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబుకు ఏపీసీ ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం ఆయన సమగ్ర ఉద్యోగుల జీతాలకు సంబంధించిన ఫైలుపై సంతకం చేయనున్నారు. ఒకట్రెండు రోజుల్లో ఉద్యోగుల ఖాతాల్లో జీతం జమకానుంది. జిల్లాలోని దాదాపు 1,500 మంది సమగ్ర రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నవంబరు వేతనాలకు సంబంధించి రూ. 3.19 కోట్ల బడ్జెట్ విడుదలైంది. ఎట్టకేలకు ఏపీసీగా ఇన్‌చార్జ్‌ను నియమించడంతో సమగ్ర శిక్ష ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన బోరుగడ్డ అనిల్ పోలీస్ కస్టడీ



సర్వజనాస్పత్రిలో వైద్య పరీక్షల అనంతరం అనిల్‌కుమార్‌ను తీసుకెళ్తున్న పోలీసులు

అనంతపురం: బోరుగడ్డ అనిల్ కుమార్ పోలీస్ కస్టడీ ముగిసింది. టీడీపీ మహిళా అధికార ప్రతినిధి తేజస్విని ఫిర్యాదు మేరకు అనంతపురం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో పోలీసులు అనిల్‌ను మూడు రోజుల పాటు కస్టడీకి కోరారు. ఆదివారం తెల్లవారుజాము 3 గంటలకు రాజమండ్రి జైలు నుంచి అనంతపురం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు పోలీసు కస్టడీ ముగిసింది. అనంతపురం అర్బన్ డీఎస్పీ వి. శ్రీనివాసరావు నేతృత్వంలో విచారణ చేశారు. ఆఫ్ ద రికార్డు మాట్లాడిన మాటలను యూట్యూబ్ ఛానల్‌లో ప్రసారం చేశారని బోరుగడ్డ అనిల్ విచారణలో పేర్కొన్నట్లు తెలిసింది. అనంతరం ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి తిరిగి రాజమండ్రి జైలుకు తరలించారు.

వేరుశనగ చెక్క వేలం



బుక్కరాయసముద్రం: మండలంలోని జిల్లా జైలులో బుధవారం వేరుశనగ చెక్కకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ రహ్మాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25,000 కేజీల వేరుశనగ చెక్కకు వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు. ప్రాంతీయ జైళ్ల ఉపశాఖ అధికారి కడప రేంజ్ వారి సమక్షంలో వేలం సాగుతుందన్నారు. ముందుగా రూ. 20,000 డిపాజిట్ చెల్లించాలన్నారు. వేలం పాట ముగిసిన తరువాత డిపాజిట్ వెనక్కి చెల్లిస్తామని పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తోంది. పారిశుధ్య నిర్వహణకు నిధులివ్వడం నిలిపేసింది. దీంతో అనంతపురం నగరంలో 'క్లాప్' ఆటోల ద్వారా ఇంటింటా చెత్త సేకరణ ప్రక్రియ ఆగిపోయింది. వీధుల్లో చెత్తకుప్పలు పేరుకుపోయాయి. నగరవాసులు రోగాల బారిన పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.



అనంతపురంలో ఆగిపోయిన క్లాప్ ఆటోలు

చెత్తగించేవారేరీ..?

సర్కారు పారి'చోద్యం'

- అనంతపురంలో ఆగిన క్లాప్ ఆటోలు
- ప్రభుత్వం నిధులివ్వకపోవడంతో చేతులెత్తేసిన నిర్వాహకులు
- నగరంలో ఎక్కడచూసినా పేరుకుపోయిన చెత్తదిబ్బలు
- కంపు కొడుతున్న వీధులు
- ప్రజల ఇబ్బందులు పట్టని పాలకులు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 50 డివిజన్లకు సంబంధించి క్లాప్ ఆటోలు మొత్తం 47 ఉండగా అందులో ప్రస్తుతం 10 కూడా తిరగడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈ ఆటోలు నిర్వహించే ఏజెన్సీకి క్రమం తప్పకుండా నిధులు అందేవి. అయితే, ఇటీవల కూటమి ప్రభుత్వం ఒక్కసారిగా నిధుల చెల్లింపును నిలిపేయడంతో కష్టాలు మొదలయ్యాయి. నిర్వాహకులు ఈఎంఐలు చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు 23 ఆటోలను జప్తు చేశారు. మిగిలిన ఆటోలకు సంబంధించి 15 మంది డ్రైవర్లు తమకు వేతనాలు ఇవ్వలేదని విధులకు రావడం లేదు. దీంతో ప్రభుత్వ వైద్య కళాశాల ముందున్న చెత్త తరలింపు పాయింట్ వద్ద ఆ ఆటోలు నిలిపి ఉంచారు.

ఎక్కడ చూసినా చెత్తదిబ్బలే..

నగరంలో రోజూ 140 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. ఆటోలు పూర్తిస్థాయిలో తిరగకపోవడంతో 50 టన్నుల చెత్త మాత్రమే కంపోస్టు యార్డుకు వెళ్తోంది. మిగిలిన చెత్త వీధుల్లో పేరుకుపోతోంది. ప్రస్తుతం నగరంలో ఎక్కడ చూసినా చెత్త దిబ్బలు కనిపిస్తున్నాయి. అరవిందనగర్, జీసస్‌నగర్, ఓబుళదేవనగర్, హౌసింగ్ బోర్డు, సాయినగర్, పాతూరు, రాణినగర్, నీరుగంటి వీధి, 1,2,3,4,5 రోడ్ల ప్రాంతాలు, ఆజాద్‌నగర్, రామ్‌నగర్, లక్ష్మీనగర్, ఆదర్శనగర్, నాయక్‌నగర్ తదితర ప్రాంతాల్లో చెత్త సేకరణ జరగక దుర్గంధం వెదజల్లుతోంది.

ఆరోగ్యంపై దుష్ప్రభావం..

చెత్తాచెదారం పేరుకుపోవడంతో ప్రజారోగ్యంపై ప్రభావం పడుతోంది. జిల్లాకేంద్రంలో కొన్ని రోజులుగా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇప్పటికే 50కి పైగా డెంగీ, మలేరియా కేసులు నమోదయ్యాయి. చెత్త కుప్పల నుంచి వచ్చే దుర్వాసన కారణంగా ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశం లేకపోలేదు.ఇలాంటి సమయంలో చెత్త తరలింపునకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

గతంలోనూ ఇంతే..

గతంలో టీడీపీ ప్రభుత్వం ఉన్న సమయంలో కూడా చెత్త నిర్వహణ అధ్వానంగా ఉండేది. అప్పట్లో ప్రజారోగ్యం పట్ల పాలకులు నిర్లక్ష్యం చేయడంతో నగరంలో డెంగీ, మలేరియా ప్రబలాయి. 2016 సెప్టెంబర్ 14న స్థానిక వినాయకనగర్‌కు చెందిన ఇద్రీస్, జునేద్ అనే చిన్నారులు డెంగీతో మృత్యువాత పడ్డారు. సర్కారు నిర్లక్ష్యానికి ఒకే కుటుంబంలో ఇద్దరు పిల్లల ప్రాణాలు గాల్లో కలసిపోగా, కుటుంబసభ్యులకు తీరని శోకం మిగిలింది.



అనంతపురం ఓబుళదేవనగర్‌లో దుస్థితి

అనంతపురం నగరపాలక సంస్థ వివరాలు..

డివిజన్లు	50
సచివాలయాలు	74
మొత్తం సర్కిళ్లు	6
రోజూ చెత్త ఉత్పత్తి	140 టన్నులు
ప్రస్తుత సేకరణ	50 టన్నులు
మొత్తం వాహనాలు	106
అందులో క్లాప్ ఆటోలు	47
రెగ్యులర్ పారిశుధ్య కార్మికులు	131
ఔట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు	409
రోజువారీ వేతనం కింద పని చేసే కార్మికులు	128

ఇద్దరు బిడ్డలను కోల్పోయా

2016లో వినాయకనగర్‌లో చెత్తా చెదారం పేరుకుపోయేది. శానిటేషన్ మెరుగుకు పెద్దగా చర్యలు తీసుకునే వారు కాదు. దీంతో నా ఇద్దరు బిడ్డలు డెంగీతో చనిపోయారు. ఇంతటి ఇబ్బంది ఏ తల్లికీ రాకూడదు. ఇప్పుడు నగరంలో 15 రోజులుగా చెత్త సేకరించడం లేదు. శానిటేషన్ మెరుగుపర్చాలి.
– తబసూం, వినాయకనగర్, అనంతపురం

చెత్త తీసుకెళ్లడం లేదు



నగరంలో 15 రోజులుగా చెత్తను తీసుకెళ్లడానికి వాహనాలు రావడం లేదు. దీంతో చాలా ఇబ్బందిగా మారింది. రోజుల తరబడి చెత్తను తరలించకపోవడం దారుణం. జ్వరాలు వస్తే పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడతారు.
– షానీషా, అనంతపురం

అద్దె ట్రాక్టర్లు తీసుకుంటాం



క్లాప్ ఆటోలు ఆగిన మాట వాస్తవమే. నగరంలో చెత్త సేకరణలో ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. 59 వాహనాల ద్వారా చెత్తను కంపోస్టు యార్డుకు తరలిస్తున్నాం. ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా అన్ని డివిజన్లలో చెత్త ట్రాక్టర్లు ఏర్పాటు చేయాలని చూస్తున్నాం. అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. – నాగరాజు, కమిషనర్, నగరపాలక సంస్థ

ఉద్యాన పథకాలపై విస్తృత అవగాహన



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివ్‌నారాయణశర్మ, తదితరులు

అనంతపురం అగ్రికల్చర్: ఉద్యానశాఖ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలు సద్వినియోగం చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. సోమవారం అనంతపురంలోని రెవెన్యూభవన్‌లో ఉద్యానశాఖ డీడీ నరసింహారావు ఆధ్వర్యంలో రూపొందించిన ఉద్యాన పథకాల పోస్టర్‌ను కలెక్టర్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోల్డ్‌స్టోరేజీల నిర్మాణాలకు 35 శాతం రాయితీ ఉంటుందన్నారు. 8 వేల టన్నుల కెపాసిటీ కోల్డ్‌స్టోరేజీకి రూ.1.40 లక్షల వరకు రాయితీ ఉంటుందని తెలిపారు. కలెక్షన్ సెంటర్ ఏర్పాటుకు రైతుగ్రూపులకు 75 శాతం, వ్యక్తిగతంగా అయితే 40 శాతం రాయితీ ఇస్తామన్నారు. సోలార్ కోల్డ్‌రూంలకు గ్రూపులకు 75 శాతం, వ్యక్తిగతంగా 35 శాతం రాయితీ వర్తిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మార్కెట్ల ఏర్పాటుకు 40 శాతం రాయితీ ఉంటుందన్నారు. పండ్లతోటల రైతులకు బాగా ఉపయోగపడే ఈ పథకాలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేమకల్లులో పనులు చేపట్టాలి


అనంతపురం అర్బన్: బొమ్మనహాళ్ మండలం నేమకల్లు ప్రజావేదికలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల మేరకు పనులు చేపట్టాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీకాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేమకల్లువాసులకు ముఖ్యమంత్రి 27 హామీలిచ్చారన్నారు. గ్రామంలో ఆయా శాఖల అధికారులు పర్యటించి పనులు వెంటనే చేపట్టాలన్నారు. రాష్ట్రస్థాయి అనుమతి తీసుకోవాల్సిన పనులకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. జిల్లా స్థాయికి సంబంధించిన వాటికి అనుమతి తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో సీపీఓ అశోక్‌కుమార్, డీపీఓ నాగరాజు నాయుడు, హౌసింగ్ పీడీ శైలజ, పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం, డ్వామా పీడీ సలీంబాషా, ఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ సంపత్‌కుమార్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిష్కారం చూపండి మహాప్రభో

- ఈమె పేరు శ్రీదేవి. గుమ్మఘట్ట మండలం గోనెబావి గ్రామం. 20 ఏళ్ల క్రితం గ్రామ సర్వే నంబరు 92–బీలో ఈమెకు రెండు సెంట్ల స్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. స్థలంలో కొంత మేర శ్రీదేవి ఇంటి నిర్మాణం చేపట్టింది. మిగిలిన దాన్ని మరుగుదొడ్డి, బాత్రూం, ప్రహరీ కట్టుకోవడానికి వదిలేసింది. అయితే ఇటీవల ఒక వ్యక్తి దౌర్జన్యంగా ఈమె స్థలాన్ని ఆక్రమించాడు. దీనిపై తహసీల్దారు, కళ్యాణదుర్గం ఆర్డీఓ, డీఎస్పీలను కలిసి అర్జీ ఇచ్చినా పట్టించుకోవడంతో సోమవారం అనంతపురం వచ్చి కలెక్టర్‌కు వినోద్‌కుమార్‌కు తన సమస్య చెప్పుకుంది.



- ఈ బాలుని పేరు మహేష్ నాయక్. కనీసం నిలబడలేడు. సీకేపల్లి సీహెచ్‌సీలో వైద్యులు పరీక్షించి 90 శాతం వైకల్యం ఉన్నట్లు 2022 సెప్టెంబరు 6న సర్టిఫికెట్ మంజూరు చేశారు. దీంతో దివ్యాంగ పింఛను మంజూరైంది. అయితే అది సరైన సర్టిఫికెట్ కాదంటూ ఆరు నెలల క్రితం పింఛన్ను అధికారులు నిలిపివేశారు. కుమారుడి పింఛన్ను పునరుద్ధరించాలంటూ తల్లిదండ్రులు ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోకపోవడంతో సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.



- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు 485 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: మండల స్థాయిలో పరిష్కారం కావాల్సిన సమస్యలు జిల్లా కేంద్రం వరకు రాకూడదని కలెక్టర్ పదేపదే చెబుతున్నా పరిస్థితిలో మార్పు కానరావడం లేదు. దీంతో బాధితులు వ్యయప్రయాసలకోర్చి జిల్లాకేంద్రం వస్తున్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ప్రజల నుంచి కలెక్టర్ వి.వినోద్ కుమార్‌తో పాటు జేసీ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ తిప్పే నాయక్, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 485 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ అర్జీదారులతో మాట్లాడి సమస్యను క్షుణ్ణంగా తెలుసుకుని వారు సంతృప్తి చెందేలా పరిష్కరించడంతో పాటు ఎండార్స్‌మెంట్ ఇవాలని ఆదేశించారు.

వినతుల్లో కొన్ని..

- తాము కొనుగోలు చేసిన భూమి విస్తీర్ణాన్ని తగ్గించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారని బెళుగుప్ప మండలం గుండ్లపల్లికి చెందిన పి.నాగరాజు ఫిర్యాదు చేశాడు. నరసాపురం గ్రామ పొలం సర్వే నంబరు 2–1లో 2.36 ఎకరాలను తాము కొనుగోలు చేశామని, 2016 వరకు వెబ్ ల్యాండ్‌లో ఉందని చెప్పాడు. అటు తరువాత తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే 1.20 ఎకరాలను తొలగించారని తెలిపాడు. సమస్యపై ఏళ్లుగా తిరుగుతూ అర్జీలు ఇస్తున్నా పరిష్కారం కాలేదని ఆవేదన చెందాడు.
- రీ సర్వేలో తమ భూమి విస్తీర్ణం తప్పుగా నమోదు చేశారని శింగనమల మండలం సలకంచెరువుకు చెందిన ఎం.శివయ్య ఫిర్యాదు చేశాడు. రాచేపల్లి గ్రామ పొలం సర్వే నంబరు 467–4లో తమకు 2.68 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, అయితే రీ సర్వేలో 18 సెంట్లు తక్కువగా నమోదు చేశారని చెప్పాడు. సర్వే నంబరు 467–7గా చూపారని, సేల్ డీడ్‌ను గిఫ్ట్ డీడ్‌గా నమోదు చేశారని, సెప్టెంబరు నుంచి అర్జీలు ఇస్తున్నా సమస్య పరిష్కారం కాలేదని వాపోయాడు.

సాయుధ దళాల పతాక నిధికి విరాళం

సాయుధ దళాల పతాక నిధికి కలెక్టర్ వి.వినోద్ కుమార్ విరాళం అందించారు. ముందుగా సైనిక సంక్షేమ శాఖ అధికారి తిమ్మప్ప పుష్పగుచ్ఛం అందజేసి సాయుధ దళాల పతాక స్టికర్‌ను కలెక్టర్‌కు అందించారు. అనంతరం విరాళం సేకరించారు.

థియేటర్‌లో యువకుడి మృతి

- తొక్కిసలాటలో మృతి చెందాడంటూ బంధువుల ఆందోళన



మృతుడు మద్దానప్ప



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

రాయదుర్గం: పుష్ప–2 చిత్రాన్ని వీక్షించేందుకు థియేటర్‌కు వెళ్లిన హరిజన మద్దానప్ప (37) అనే యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన రాయదుర్గం కేబీ థియేటర్‌లో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. రాయదుర్గం మండలం 74 ఉడేగోళంకు చెందిన మద్దానప్ప.. హీరో అల్లు అర్జున్ అభిమాని. పుష్ప–2 విడుదల కావడంతో సినిమా చూసేందుకు తొలి రోజు నుంచీ తాపత్రయ పడ్డాడు. చివరకు సోమవారం సాయంత్రం 6.45 గంటలకు ఫస్ట్‌షోకు వెళ్లాడు. ఏం జరిగిందో ఏమో కానీ థియేటర్‌లోనే మృతి చెందాడు. అతని మరణవార్త తెలియగానే స్వగ్రామం నుంచి కుటుంబ సభ్యులు, బంధువులు పెద్దసంఖ్యలో కేబీ సినిమా థియేటర్ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. తొక్కిసలాటలోనే మృతి చెంది ఉంటాడని కొందరు అనుమానం వ్యక్తం చేశారు. ఇంకేదైనా జరిగి ఉందేమోనన్న కోణంలో విచారణ చేయించాలని మరికొందరు డిమాండ్ చేశారు. పెద్ద సినిమాలు విడుదల అయినప్పుడైనా సరైన బారికేడ్లు ఏర్పాటు చేయకపోతే ఎలాగని మండిపడ్డారు. ఆదివారం మ్యాట్నీషోలో కూడా టికెట్ల విషయంపై అక్కడ గొడవ జరిగినట్లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యిందన్నారు. థియేటర్ లోపలి నుంచి మృతదేహాన్ని బయటకు వేసి మరో షో ఎలా మొదలుపెడతారని ప్రశ్నించారు. న్యాయం చేసేవరకు మృతదేహాన్ని ఇక్కడి నుంచి కదలనిచ్చేది లేదంటూ అంబులెన్స్‌ను సైతం వెనక్కి పంపారు. ఆందోళన ఉధృతం కావడంతో అర్బన్ సీఐ జయనాయక్ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఆందోళనకారులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అయినా వారు వినలేదు. న్యాయం చేసే వరకు కదలబోమంటూ భీష్మించి.. మృతదేహంతో ఆందోళన కొనసాగించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తామని సీఐ తెలిపారు.

'నిరంకుశ జీఓను రద్దు చేయాల్సిందే'



రిలే దీక్షలో న్యాయవాదులు

అనంతపురం: గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల కేసుల విచారణను జిల్లా అదనపు కోర్టుల నుంచి ప్రత్యేక కోర్టులకు బదలాయిస్తూ చంద్రబాబు ప్రభుత్వం తీసుకొచ్చిన నిరంకుశ జీఓను రద్దు చేసే వరకూ తమ పోరాటం ఆగదని న్యాయవాదులు స్పష్టం చేశారు. జీఓ నంబర్ 145ను వ్యతిరేకిస్తూ అనంతపురం జిల్లా కోర్టు ప్రాంగణంలో సోమవారం కూడా న్యాయవాదులు రిలే నిరాహార దీక్ష కొనసాగించారు. వారికి డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, సెక్రటరీ ఇమామ్ బాష, ఏపీసీసీ మెంబర్ శంకర్, బీజేపీ నాయకులు, రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రా రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మూర్తి, అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి అధ్యక్షుడు కేవీ రమణ, సీనియర్ న్యాయవాది ఖమీర్ బేగం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు కాకుండా కుట్రలకు తెరతీసిన ప్రభుత్వం ఇప్పుడు స్పెషల్ కోర్టుల పేరుతో కోర్టులను సైతం కేంద్రీకరిస్తుండటం అన్యాయమన్నారు. డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతిలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేస్తే పేదలు చాలా ఇబ్బందులు పడతారన్నారు. సీనియర్ న్యాయవాది హనుమన్న మాట్లాడుతూ ప్రభుత్వం కనీసం బార్ కౌన్సిల్ సిఫార్సులు సైతం పరిగణనలోకి తీసుకోలేదన్నారు.వాది, ప్రతివాది, జామీన్లు వేసే అందరికీ ఈ మార్పు వల్ల ఇబ్బందులు తప్పవని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు బాలాజీ నాయక్, సూరప్ప, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

దారికి పచ్చటి తోరణం

కనువిందు చేసే పచ్చని చెట్లు... బడలికను పోగొట్టే చల్లగాలి... ఎవరైనా సరే ఆ మార్గంలో ఒకసారి ప్రయాణిస్తే ఫిదా అవ్వాల్సిందే. మళ్లీ మళ్లీ ఆ దారిలో వెళ్లాలనే కోరిక తట్టాల్సిందే. రహదారికి పచ్చటి తోరణం కట్టినట్లుండి.. వాటి కిందకు వెళ్లగానే ఏదో గుహలోకి ప్రవేశించినట్లుగా కలిగే అనుభూతి ప్రయాణికులను కొద్దిసేపు అక్కడ ఆగేలా చేస్తోంది. గార్లదిన్నె నుంచి మిడ్‌పెన్నార్ డ్యాంకు వెళ్లే మార్గంలో రోడ్డుకిరువైపులా చెట్లు ప్రయాణికులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



క్లుప్తంగా

'పోలీసు స్పందన'కు 110 వినతులు



సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 110 వినతులు అందాయి. ఎస్పీ పి.జగదీష్ స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి, మహిళా పీఎస్ డీఎస్పీ ఎస్.మహబూబ్‌బాషా, ఎస్బీ సీఐలు ధరణి కిశోర్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

20 గొర్రెల అపహరణ



బాధితుడు రామాంజనేయులు

యల్లనూరు: మండలోని 20 గొర్రెలను దుండగులు అపహరించుకెళ్లినట్లు బాధిత కాపరి రామాంజనేయులు వాపోయాడు. వివరాలు.. యల్లనూరు మండలం కూచివారిపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయులు గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో తనకున్న 250 గొర్రెలను గ్రామ శివారులోని దొడ్డిలో వదిలి ఇంటికెళ్లి నిద్రించాడు. ఉదయం మంద వద్దకెళ్లి పరిశీలిస్తే అందులో 20 గొర్రెలు తక్కువగా ఉన్నట్లుగా గుర్తించాడు. చుట్టుపక్కల ఉన్న ఆనవాళ్లను బట్టి గొర్రెలను దుండగులు అపహరించుకెళ్లినట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పెనుకొండ రూరల్: భూ వివాదం కారణంగా ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాలు... పెనుకొండ మండలం శెట్టిపల్లికి చెందిన మంజులకు పూర్వీకుల నుంచి సర్వే నంబర్ 28–2లోని 28 సెంట్ల భూమి సంక్రమించింది. ఇందులో సోమవారం పండ్ల మొక్కలు నాటుతుండగా రెవెన్యూ అధికారులు, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన మంజుల అక్కడే శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకునే ప్రయత్నం చేసింది. గమనించిన స్థానికులు అడ్డుకున్నారు.



అనంతపురంలోని ఆదిమూర్తినగర్‌లో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం



అర్బన్ హెల్త్ సెంటర్ పేరు మార్చి అప్పటి సీఎం వైఎస్ జగన్, దివంగత వైఎస్సార్ చిత్రాలు లేకుండా చేసిన దృశ్యం

వాస్తవాలకు రంగేశారు!

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టి నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ క్రమంలోనే పట్టణ ఆరోగ్య కేంద్రాల రూపురేఖలను మార్చేశారు. అన్ని సౌకర్యాలతో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించారు. తమకు చేరువగానే నాణ్యమైన వైద్య సేవలు అందడంతో అప్పట్లో ప్రజల నుంచి సర్వత్రా హర్షం వ్యక్తమైంది. దీన్ని కూటమి సర్కార్ జీర్ణించుకోలేకపోతోంది. రూ.5 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన అనంతపురం నగరంలోని ఆరు పట్టణ ఆరోగ్య కేంద్రాలను నిర్వీర్యం చేసే పనులకు శ్రీకారం చుట్టింది. అత్యాధునిక సౌలభ్యాలతో ఏర్పాటు చేసిన పట్టణ ఆరోగ్య కేంద్రాలపై గత ప్రభుత్వ ఆనవాళ్లు లేకుండా కూటమి సర్కార్ చేపట్టిన చర్యలపై నేడు సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం





అనంతపురం రెండో రోడ్డులో గత ప్రభుత్వంలో నిర్మించిన వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం, ప్రస్తుతం పేరు మార్చిన దృశ్యం



పాతూరు సీడీ ఆస్పత్రి భవనంపై మాజీ సీఎం వైఎస్ జగన్ , దివంగత నేత వైఎస్సార్ చిత్రాలు



వైఎస్ జగన్, వైఎస్సార్ చిత్రాలకు పెయింట్ కొట్టిన దృశ్యం

బడుగులపై టీడీపీ నేతల దౌర్జన్యం

- ఇంటి పునాది రాళ్లను తొలగించిన వైనం
- పక్కా గృహం మంజూరైనా తమ అనుమతి తప్పనిసరి అంటూ టీడీపీ నేతల హుకుం
- కలెక్టరుకు ఫిర్యాదు చేసిన బాధితులు



పునాది రాళ్లను తొలగించిన దృశ్యం

ఆత్మకూరు: 'చూడప్ప వినోదూ! నీకు మాకు మధ్య ఎలాంటి గొడవలు లేవు. అయినా ఇల్లు కట్టే పని ఆపేయ్. ఎందుకు చెప్తున్నానో అర్థం చేసుకో. లేదంటే లేనిపోని సమస్యల్లో చిక్కుకుంటావ్' అంటూ ఆత్మకూరు మండలం బి.యాలేరు గ్రామానికి చెందిన బడుగులపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నేతలు దౌర్జన్యానికి తెగబడ్డారు. పక్కా గృహ నిర్మాణం మంజూరైనా తమ అనుమతి లేనిదే కట్టకూడదంటూ పునాది రాళ్లను పెకలించేశారు. ఘటనపై బాధితులు నేరుగా సోమవారం కలెక్టరేట్‌కు చేరుకుని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలసి ఫిర్యాదు చేశారు. వివరాలు...

కూలి పనులతో జీవనం సాగిస్తున్న బి.యాలేరు గ్రామానికి చెందిన కుమ్మర వినోద్‌కుమార్, విమల దంపతులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీలో ఇంటి స్థలం మంజూరైంది. పక్కా గృహనిర్మాణానికి అనుమతులు సైతం అప్పటి జగన్ ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా గృహ నిర్మాణ పనులు అప్పట్లో వారు చేపట్టలేకపోయారు. కాస్త డబ్బు సమకూరడంతో ఇటీవల నిర్మాణ పనులు చేపట్టారు. ఆదివారం ఉదయం పునాది వేశారు. ఆ సమయంలో వినోద్‌ను కొందరు టీడీపీ నాయకులు కలసి తమ అనుమతి లేకుండా ఇంటి నిర్మాణ పనులు ఎలా చేపడతావంటూ మందలించారు. వెంటనే పనులు ఆపేయాలని, లేకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. అంతటితో ఆగకుండా రాత్రికి రాత్రే పునాది రాళ్లను పెకలించి వేశారు. ఘటనపై సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌ను కలసి ఫిర్యాదు చేసినట్లు బాధితులు వివరించారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

పుట్టపర్తి టౌన్: మండల పరిధిలోని ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సురేష్ తెలిపారు. వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. ఐదు రోజుల క్రితం పుట్టపర్తి మండలంలోని ఓ గ్రామానికి 6వ తరగతి విద్యార్థిపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ద్వారా విషయం తెలుసుకున్న తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పుట్టపర్తి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం గంటల మారెమ్మ ఆలయం వద్ద తచ్చాడుతున్న నిందితుడిని గుర్తించి, అరెస్ట్ చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

యానిమేటర్ల జీతాలు స్వాహా



ఏపీఎం గంగన్నకు వినతిపత్రం ఇస్తున్న పాత యానిమేటర్లు

శెట్టూరు: తమకు మంజూరైన జీతాలను కొత్త యానిమేటర్లు స్వాహా చేశారంటూ పాత యానిమేటర్ల వాపోయారు. ఈ మేరకు సోమవారం మండల ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం గంగన్నను పాత యానిమేటర్ల పార్వతమ్మ, గీతమ్మ, శివలింగమ్మ కలసి రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. మే, జూన్ నెలలకు సంబంధించి తమకు మంజూరైన జీతాలు డ్రా చేసి ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. దీనికి అక్కడే ఉన్న సీసీ లక్ష్మీపతి మాట్లాడుతూ.. సంబంధిత సీసీల సంతకాలు లేకుండా చెక్కులను కొత్త యానిమేటర్లు డ్రా చేసినట్లు వివరించారు. వారితో రికవరీ చేయించి చెల్లిస్తామని చెప్పుకొచ్చారు. వాస్తవానికి ఈ ఏడాది జూన్ నెల వరకు 33 మంది పాత యానిమేటర్లు పని చేశారు. ప్రభుత్వం మారిన తర్వాత 28 మంది యానిమేటర్లను బలవంతంగా తొలగించి, వారి స్థానంలో జూలైలో కొందరిని, ఆగస్టులో మరికొందరిని నియమించారు. అప్పటి వరకూ శెట్టూరు, చెర్లోపల్లి, ములకలేడు, లక్ష్మంపల్లి క్లస్టర్లలో 33 మంది యానిమేటర్లు పనిచేశారు. వీరికి జూన్, జూలైకు సంబంధించి మంజూరైన జీతాలను కొత్తగా వచ్చిన సీసీలు, కొత్తగా ఏర్పడిన గ్రామ సమాఖ్య సంఘాల నేతలు కలిసి కొత్తగా వచ్చిన యానిమేటర్లకు కట్టబెట్టారు. మే, జూన్, జూలై నెలల్లో పనిచేయకపోయిన వారికి జీతాలు ఎలా చెల్లించారో అర్థం కావడం లేదంటూ పాత యానిమేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 4.48 లక్షల సొమ్ము పక్కదారి పట్టించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థిని మృతిపై పోలీసుల విచారణ

రొద్దం: ట్రాక్టర్ కిందపడి మృతి చెందిన విద్యార్థిని విషయం వెలుగు చూడకుండా రాత్రికి రాత్రే ఖననం చేసిన ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. వివరాలు... రొద్దం మండలం పి.రొప్పాల గ్రామానికి చెందిన శ్రీరాములు, వెంకటలక్ష్మమ్మ దంపతుల కుమార్తె హర్షిత (13) ఎనిమిదో తరగతి చదువుతోంది. ఆదివారం రాత్రి శ్రీరాములు ట్రాక్టర్ నడుపుతుండగా ప్రమాదవశాత్తు హర్షిత జారి కిందపడి అక్కడికక్కడే మృతిచెందింది. అయితే ఈ విషయాన్ని దాటిపెట్టి రాత్రికి రాత్రే బాలిక మృతదేహాన్ని కుటుంబసభ్యులు ఖననం చేశారు. అయితే బాలిక మృతిపై అనుమానాలు వ్యక్తం కావడంతో పోలీసులు సోమవారం ఉదయం ఆ గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. తల్లిదండ్రులను తమదైన శైలిలో ఆరా తీయడంతో వాస్తవం వెలుగు చూసింది. కాగా, పోలీసుల విచారణలోనూ వారు తొలుత మూర్ఛ వ్యాధితో మృతి చెందినట్లు బుకాయించినట్లుగా తెలిసింది. తల్లి వెంకటలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్‌ఐ నరేంద్ర... పాతిపెట్టిన బాలిక మృతదేహాన్ని సోమవారం సాయంత్రం తహసీల్దార్ నాగేంద్ర సమక్షంలో వెలికి తీయించి పంచనామా నిర్వహించిన అనంతరం తిరిగి ఖననం చేయించారు.

మూడు వారాలుగా పనుల్లేవ్!

- ఉద్యోగం వదిలి వెళ్లాలంటూ ఫీల్డ్ అసిస్టెంట్‌పై టీడీపీ నేతల ఒత్తిళ్లు
- తమకు అనుకూలమైన వ్యక్తికి ఫీల్డ్ అసిస్టెంట్ బాధ్యతల అప్పగింత
- జీతంపడే వరకూ పనులు కల్పించనంటూ భీష్మించిన 'నూతన' ఫీల్డ్ అసిస్టెంట్
- ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడించిన కూలీలు



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు

గుంతకల్లు రూరల్: రాష్ట్రంలో కూటమి సర్కార్ ఏర్పాటైన తర్వాత టీడీపీ నేతల దౌర్జన్యాలకు అంతు లేకుండా పోతోంది. తాజాగా ఉపాధి కూలీల పొట్ట కొట్టడంతో ఆగ్రహానికి గురైన కూలీలు సోమవారం ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. మూడు వారాలుగా తమకు పనులు కల్పించడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. వివరాలు...

మేము చెప్పినవారే పనిచేయాలి

'ఈ ప్రభుత్వం మాది. ఇక్కడ మేము చెప్పిన వారే పనిచేయాలి' అనే ధోరణితో టీడీపీ నాయకులు దౌర్జన్యం కాస్త ఉపాధి కూలీలకు శాపంగా మారింది. కొన్నేళ్లుగా గుంతకల్లు మండలం తిమ్మాపురం గ్రామానికి సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వీరనాగయ్యపై కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఉద్యోగం మానేసి వెళ్లాలంటూ టీడీపీ నేతల ఒత్తిళ్లు తీవ్రమయ్యాయి. 18 సంవత్సరాల తన విధి నిర్వహణలో ఎక్కడేగాని అవినీతికి పాల్పడలేదని, ఎంతో నిజాయితీగా నిబద్ధతతో పనులు కల్పిస్తూ వస్తున్న తనను అకారణంగా తప్పుకోమంటే సాధ్యం కాదని టీడీపీ నేతలకు వీరనాగయ్య స్పష్టం చేశాడు. దీంతో అధికారులపై ఒత్తిళ్లు తీసుకెళ్లి రెండు నెలల క్రితం తమకు అనుకూలంగా ఉన్న అజయ్‌కు అప్పటికప్పుడు జాబ్ కార్డు సిద్ధం చేయించి ఫీల్డ్ అసిస్టెంట్‌గా బాధ్యతలు అప్పగించేలా కుట్రలు చేశారు.

పనులు కల్పించేది లేదంటూ

ఫీల్డ్ అసిస్టెంట్‌గా అజయ్‌ను నియమించిన తర్వాత అధికారుల నుంచి వీరనాగయ్యకు నోటీసులు అందాయి. వీటికి సమాధానం చెప్పడానికి ఆయన తరచూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించలేదు. ఈ క్రమంలోనే ఈ ఏడాది సెప్టెంబర్ వరకు వీరనాగయ్యకు అందాల్సిన జీతాన్ని ఆయన బ్యాంక్ ఖాతాలోనే అధికారులు జమ చేశారు. దీనిపై అజయ్ మండిపడ్డాడు. రెండున్నర నెలలుగా తాను పనిచేస్తున్నా... నయాపైసా జీతం చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మూడు వారాలుగా గ్రామంలో కూలీలకు పనులు కల్పించకుండా ఆపేశాడు. వ్యవసాయ పనులు లేకపోవడం, ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలూ లేకపోవడంతో పూట గడవని కూలీలు పనులు పెట్టకపోతే ఎలాగంటూ సోమవారం అజయ్‌ను నిలదీశారు. జీతం లేకుండా పని చేయడానికి తానేమీ పిచ్చోడిని కాదని, తనకు జీతం పడేవరకూ ఎవరు ఎంత గింజుకున్నా పనులు కల్పించేది లేదని తెగేసి చెప్పాడు. అయితే దీనిపై అధికారులకు ఫిర్యాదు చేస్తామని కూలీలు అనడంతో రండి నేనే తీసుకెళ్తానంటూ అందరినీ పోగేసుకుని ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్నాడు. దీంతో కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. తమకు పనులు కల్పించాలంటూ కూలీలు ధర్నా చేపట్టారు.

కూలీలను రెచ్చగొడతావా?

గ్రామంలో ఉపాధి పనులు ఆపేయడమే కాకుండా కూలీలను రెచ్చగొట్టి మరీ కార్యాలయం వద్ద ధర్నా చేయిస్తావా? అంటూ అజయ్‌పై ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం జరిగి మూడు నెలలు కూడా కాలేదన్నారు. ఇప్పటివరకూ కొత్త ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎవరికీ జీతం పడలేదని, నీకు మాత్రమే ఎలా పడుతుందని ప్రశ్నించారు. జీతం రాకపోతే అధికారులను సంప్రదించాలని కానీ, కూలి పనులు ఆపేయమని ఎవరు చెప్పారంటూ నిలదీశారు. వెంటనే కూలీలకు పనులు కల్పించకపోతే మరొకరిని నియమించాల్సి వస్తుందని హెచ్చరించారు.

వలస పోదామన్నా డబ్బు లేదు



మాకు పొలం లేదు, కూలి పనులు తప్ప మరో జీవనోపాధి లేదు. పనులకు వెళ్దామంటే వ్యవసాయ పనులు లేవు. మూడు వారాలుగా ఉపాధి పనులూ కల్పించలేదు. దీంతో చేతిలో చిల్లిగవ్వ లేకుండా పోయింది. నా భర్తతో పాటు కొడుకు, కోడలితో కలసి ఇతర ప్రాంతాలకు వలస పోదామనుకుంటే చేతిలో డబ్బు లేక ఇక్కడే పస్తులతో గడపాల్సి వస్తోంది.

– హనుమక్క, ఉపాధి కూలీ, తిమ్మాపురం

పూట గడవటం కష్టమైంది



నాతో పాటు, నా కొడుకు, కోడలు కూడా ఉపాధి కూలీలే. ముగ్గురూ కలిసి కష్టపడితేనే కుటుంబం నడవడం కష్టం. అలాంటిది మూడు వారాలుగా పనులు నిలిపేస్తే మేము ఏమి తినాలి, ఎలా బతకాలి. పనులు పెట్టమని అడిగితే ఫీల్డ్ అసిస్టెంట్ నేను పెట్టను అంటున్నాడు. అందుకే అధికారులనే అడగాలని వచ్చాం.

– సుమంగళమ్మ, ఉపాధి కూలీ, తిమ్మాపురం

పిల్లల్ని ఎలా పోషించుకోవాలి?



మా కంటూ సొంతంగా ఇల్లు కూడా లేదు. నేను, నా భర్త కూలి పనులతో పాటు ఉపాధి పనులతో జీవనం సాగిస్తున్నాం. ఉదయాన్నే ముగ్గురు పిల్లలను అంగన్‌వాడీ సెంటర్‌లో వదిలి కూలి పనులకు వెళ్తాం. సెంటర్‌కు సెలవు ఉంటే పిల్లల్ని పనిప్రాంతానికి పిలుచుకెళుతాం కానీ, పని మాత్రం మానుకోలేని పరిస్థితి మాది. అలాంటిది మూడు వారాలుగా పనులు నిలిపేస్తే పిల్లల్ని ఎలా పోషించుకోవాలి?

– హమీద, ఉపాధి కూలీ, తిమ్మాపురం

మూగ రోదన

- పశువైద్యానికి మందుల కొరత
- ఆస్పత్రుల్లో మందులు లేక బయటకు రాసిస్తున్న పశువైద్యులు



అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో పశువైద్యం గాలిలో దీపంలా తయారైంది. చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఆరు నెలలు కావస్తున్నా ఒక్కసారి కూడా పశువైద్యం గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రతి మూడు నెలలకోసారి పశు వైద్యశాలలకు అవసరమైన మందులు, వైద్య సామగ్రి సరఫరా చేయాల్సివున్నా... ఈ ఆరు నెలల కాలంలో ఒక్కసారి కూడా మందులు అంద జేయలేదు. ఇదిగో అదిగో అంటూ నెలల తరబడి నెట్టుకొస్తున్నారు. గత ఫిబ్రవరిలో అప్పటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సరఫరా చేసిన మందులనే ఇంతకాలం సర్దుబాటు చేసుకుంటూ వస్తున్నారు. ఇప్పటికే చాలా ఆసుపత్రుల్లో మందులు పూర్తిగా అయిపోయినట్లు తెలుస్తోంది. వైద్యానికి వచ్చిన పశు వులు, జీవాలు, కుక్కలు లాంటి వాటికి అవసరమైన మందులు బయటకు రాసిస్తున్నారని ప్రజలు రైతులు, కాపర్లు వాపోతున్నారు. సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు, అంతుచిక్కని రోగాలు ప్రబలుతున్న సమయంలోనూ సర్కారు నిర్లక్ష్యంగా ఉండటం సరికాదని అంటున్నారు.

తీవ్రంగా కొరత..

జిల్లా వ్యాప్తంగా పట్టణ, ఏరియా పశువైద్యశాలలు (వెటర్నరీ హాస్పిటల్స్–వీహెచ్‌లు) 15 ఉండగా అక్కడ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) స్థాయి అధికారి వైద్య సేవలు అందిస్తున్నారు. మండల, మేజర్ పంచాయతీ ప్రాంతాల్లో వెటర్నరీ డిస్పెన్సరీలు (వీడీ) 56 ఉండగా, గ్రామ స్థాయి పశుచికిత్సా కేంద్రాలు (రూరల్ లైవ్‌స్టాక్ యూనిట్స్–ఆర్‌ఎల్‌యూ) 14 ఉన్నాయి. ఇవి కాకుండా 122 గోపాలమిత్ర కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటన్నింటిలోనూ మందుల కొరత తీవ్రంగా ఉన్నట్లు తెలిసింది. ప్రథమ చికిత్స చేయడానికి కూడా చాలా ఆస్పత్రుల్లో అత్యవసర మందులు (లైఫ్ సేవింగ్ డ్రగ్స్)తో పాటు ప్రాణాంతక వ్యాధుల చికిత్సకు ఖరీదైన మందులు అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. ఇక కుక్కలు, పిల్లులు వంటి వాటికి మందుల కొరత అధికంగా ఉన్నట్లు చెబుతున్నారు. పశువులకు థైలేరియా (మలేరియా లాంటి వ్యాధి), గర్భకోశవ్యాధులు, పొదుగువాపు వ్యాధి, కుక్కలకు సంబంధించి రేబీస్ టీకాలు, మరికొన్ని మందులతో పాటు ముఖ్యమైన యాంటీబయాటిక్స్, సెలైన్స్, నొప్పి నివారణ (పెయిన్‌కిల్లర్స్) మందులు కొరత ఎక్కువగా ఉన్నట్లు సమాచారం.

ఆకట్టుకున్న కళాఉత్సవ్



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్

పుట్టపర్తి: బుక్కపట్నంలోని ఉపాధ్యాయ శిక్షణ సంస్థ(డైట్)లో సోమవారం నిర్వహించిన కళాఉత్సవ్ ఆకట్టుకుంది. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి పలు పాఠశాలలకు చెందిన 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారని ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. నాటకం, నృత్యం, మ్యూజిక్, ఫోక్ డ్యాన్స్ తదితర పోటీల్లో ప్రతిభ చాటి ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. మ్యూజిక్‌లో రాప్తాడు పాఠశాలకు చెందిన కీర్తన, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్‌లో అభిరానందన్ (రాప్తాడు), నృత్యంలలో రాయదుర్గం బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని సాయిశ్రీ దీప్తి, గ్రూప్ డ్యాన్స్‌లో బుక్కపట్నం బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన శ్వేత, మరో 20 మంది బాలికలు, ట్రెడిషనల్ స్టోరీలకు సంబంధించి రాప్తాడు పాఠశాలకు చెందిన భవిష్యకుమార్ విజేతలుగా నిలిచారన్నారు. విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వ్యాయామ అధ్యాపకుడు రామకృష్ణ, అధ్యాపకులు లక్ష్మీనారాయణ, రాధిక, గోవిందరాజులు, సిబ్బంది పాల్గొన్నారు.



శాస్త్రీయ నృత్యం చేస్తున్న విద్యార్థిని



జానపద నృత్యం చేస్తున్న విద్యార్థులు

క్లుప్తంగా

సీపీఎం నగర కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న నూతన కమిటీ సభ్యులు

అనంతపురం అర్బన్: సీపీఎం నగర 8వ మహాసభ సమావేశంలో భాగంగా సోమవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో 27 మందితో నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీపీఎం నగర కార్యదర్శిగా వి.రామిరెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యులుగా ఆర్వీ నాయుడు, వెంకట నారాయణ, గోపాల్, ముర్తుజా, వలి, ప్రకాష్, మసూద్, ఇర్ఫాన్‌ను ఎన్నుకున్నారు. సభ్యులుగా ఓబులేసు, లక్ష్మీనరసమ్మ, ఏటీఎం నాగరాజు, వెంకటేష్, ఎన్టీఆర్ శ్రీను, ప్రసాద్, జీవ, ఇర్ఫాన్, బుల్లె రాజు, రామాంజినమ్మ, బాలకృష్ణ, బాబా, ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణ, గఫూర్, ఆదినారాయణ, వెంకటనారాయణ, లతీఫ్‌ను ఎన్నుకున్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటాలు సాగిస్తామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

అనంతపురం టవర్‌క్లాక్: స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం మాజీ రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి మధుసూదన రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రె పార్టీ బలోపేతానికి సోనియా గాంధీ శక్తివంచన లేకుండా కృషి చేశారన్నారు. అనంతరం ఆదరణ సేవా హోంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో కొండారెడ్డి, హరి రాయల్, శర్మాస్ వలి, ఓబులేసు, నిశాంత్ రెడ్డి, నరసింహ మూర్తి, మసాల రవి, బషీర్ అహ్మద్, మొహిద్దీన్, శీనా, సాకే శంకర్, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నగరపాలక సంస్థ ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో విధులు నిర్వర్తించే పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు సమానంగా వేతనాలు మంజూరు చేయాలని నగరపాలక సంస్థ కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం నగరపాలక సంస్థ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలవుతున్నా.. సమ్మెకాలంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చ లేదన్నారు. పారిశుధ్య కార్మికులతో సమానంగా ఇంజినీరింగ్ కార్మికులకు రూ.21,000 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులకు పనిముట్లు, ఈఎఫ్, పీఎఫ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. స్కూల్ స్వీపర్లు, వాచ్‌మెన్లకు పెండింగ్‌లో ఉన్న 7 నెలల జీతాన్ని తక్షణం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శివకృష్ణ, నాగేంద్రబాబు, రామాంజనేయులు, ప్రాద్, దేవమ్మ, రఫి, సరస్వతి, లక్ష్మీదేవి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



యంత్రాల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. సోమవారం అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని పలువురు రైతులకు సబ్సిడీపై పంటకోత యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 2014–19లో టీడీపీ ప్రభుత్వంలో ఎంతో మంది రైతులకు సబ్సిడీతో యంత్ర పరికరాలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు, గొర్రెల యూనిట్లు పంపిణీ చేశామన్నారు. ఇప్పుడు కూడా పాడి రైతులకు గోకుల షెడ్లు నిర్మిస్తున్నామన్నారు. ప్రస్తుతం కూలీల కొరత ఉన్న నేపథ్యంలో ఈ యంత్రాలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రవి, ఏఓ శశికళ, ఆత్మకూరు మండల ఇన్‌చార్జ్ ఏఓ సాయి లక్ష్మి పాల్గొన్నారు.

చీరల పంపిణీ

అనంతపురం కల్చరల్: కళాకారుల కాలనీలోని రేమా ప్రార్థన మందిరంలో సోమవారం సాయంత్రం నిరుపేద మహిళలకు చీరల పంపిణీ చేశారు. చర్చి పాస్టర్ రెవరెండ్ మనుష్యే వాక్యోపదేశం చేసి సేవా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవంతుడిని ప్రార్థనలు, స్తుతితో కన్నా సాటి మనిషి ఆకలిదప్పికలను తీర్చాలన్నారు. అనంతరం చర్చి సభ్యులైన 50 మంది మహిళలకు బ్రదర్ ప్రియవర్ధన్, సిస్టర్ మౌనిష, బ్రదర్ జీవన్, పురుషోత్తమ్, సిస్టర్ మేరి ప్రభావతి చేతుల మీదుగా చీరలు అందజేశారు. అంతకు ముందు చర్చిలో సామూహిక ప్రార్థనలు జరిగాయి.

షెడ్డు వేసెయ్.. దోచెయ్



జీసెస్ నగర్‌లో మెడికల్ కాలేజ్ క్వార్టర్స్ ముందు క్రేన్ సాయంతో షెడ్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

మెడికల్ కళాశాల క్వార్టర్స్ ముందు అనధికారికంగా ఏర్పాటు చేసిన వ్యాపార సముదాయాలు

టీడీపీ నాయకుల సైడ్ బిజినెస్

- నగరంలో ఇష్టారాజ్యంగా వ్యాపార సముదాయాలు
- నెలసరి మామూళ్లతో అంగళ్ల ఏర్పాటుకు అనుమతి
- పట్టించుకోని నగరపాలక సంస్థ అధికారులు

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో అందిన కాడికి దోచుకోవడానికి తెలుగు తమ్ముళ్లు ఆరాటపడుతున్నారు. ప్రధాన రోడ్లలో అనధికారికంగా వ్యాపార సముదాయాలు (షెడ్లు) ఏర్పాటు చేసుకునేందుకు పరోక్షంగా సహకరిస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అందుకోసం వ్యాపారులతో ప్రతి నెలా మామూళ్లు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇష్టారాజ్యంగా వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేస్తున్నప్పటికీ నగరపాలక సంస్థ అధికారులు అటువైపు వెళ్లడం లేదు. అధికార పార్టీకి చెందిన నాయకుల సిఫార్సు ఉండటంతో వారు చేష్టలుడిగి చూస్తున్నారు.

కమర్షియల్ ప్రాంతాలపై గురి

నగరంలోని విద్యుత్ నగర్, గుల్జార్ పేట, అరవింద నగర్, జీసస్ నగర్, హౌసింగ్ బోర్డు, తదితర ప్రాంతాల్లో రోడ్డుకు ఆనుకుని వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేశారు. రేకుల షెడ్లలో వ్యాపారాలు చేసుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. భారీ క్రేన్‌ల సహాయంతో రేకుల షెడ్లు వేసుకుంటున్నా.. నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారుల కన్నెత్తి చూడటం లేదు. ఇటీవల మార్కెట్‌లోకి వచ్చిన చాయ్ బిస్కట్, సోడా, తదితర వ్యాపారాలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి, ఉచితంగా నగరపాలక సంస్థకు చెందిన స్థలాల్లో వ్యాపారాలు చేసుకోవడం చర్చనీయాంశమైంది. ఎక్కడైనా తోపుడు బండ్లు పెట్టుకుని సాయంత్రానికంతా వెళ్లిపోయినా సరిపోతుంది. అటువంటిది ఏకంగా పెద్ద ఎత్తున వ్యాపారాలకు సిద్ధమవుతున్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం:

నగరంలో రోజు రోజుకు జనాభా పెరిగిపోతుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జీసస్ నగర్, హౌసింగ్ బోర్డు, విద్యుత్ నగర్ ఇటీవల వ్యాపారాలకు కేంద్రాలుగా మారాయి. కాగా ఇటువంటి ప్రాంతాల్లో రోడ్లకు ఆనుకుని వ్యాపారులు షెడ్లు వేయడంతో భవిష్యత్తులో కచ్చితంగా ట్రాఫిక్‌కు ఇబ్బంది ఎదురుకాక తప్పదు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణ

అదేవిధంగా నగరపాలక సంస్థ ప్రజాధనంతో అరవింద నగర్ ఎస్ఎస్ఎస్ కళాశాల, కోర్టు రోడ్డు, ఆదిమూర్తి నగర్, ప్రభుత్వ వైద్య కళాశాల ముందు ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేశారు. కాగా ఆ ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. రూ.లక్షల ప్రజాధనంతో వేసిన ఫుట్‌పాత్‌ల్లో ప్రజలు నడవడానికి వీల్లేకుండా పోయాయి.

చర్యలు తీసుకుంటాం



అనధికారికంగా నిర్మాణాలు, షెడ్లు వేస్తే ఉపేక్షించేది లేదు. ఎక్కడా లేని సంస్కృతి నగరంలో ఇక్కడ తయారైంది. దీనిపై ప్రత్యేక దృష్టిసారిస్తాం. తగు చర్యలు తీసుకుంటాం.

– నాగరాజు, కమిషనర్, నగరపాలక సంస్థ

కాంప్లెక్స్ తొలగించకుండా న్యాయం చేయండి



సమావేశమైన ముస్లిం మతపెద్దలు, ప్రజాప్రతినిధులు

అనంతపురం టవర్‌క్లాక్: మసీద్ కాంప్లెక్స్ తొలగించకుండా న్యాయం చేయాలని మేయర్ వసీం, ముస్లిం మత పెద్దలు, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ కోరారు. సోమవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మసీద్ కాంప్లెక్స్ తొలగింపుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరంలో రోడ్లు వెడల్పు పనుల్లో భాగంగా సప్తగిరి సర్కిల్‌లో ఉన్న మసీదు కాంప్లెక్స్‌ను తొలగించేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. మసీదు కాంప్లెక్స్ తొలగిస్తే షాపుల యజమానులు నష్టపోతారని గుర్తు చేశారు. నష్ట పరిహారం కింద ఎంత అడగాలి? ఎన్ని అడుగుల తొలగింపునకు అంగీకారం తెలపాలి తదితర అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకుందామని పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే నష్ట పరిహారంపై అందరం చర్చించుకుని అధికారులకు తెలుపుదామన్నారు. ముతవల్లీ, రెవెన్యూ అధికారులు, స్థానిక ఎమ్మెల్యేతో చర్చించి నిర్ణయం తీసుకుందామన్నారు. కార్యక్రమంలో సాలర్ బాషా, ముస్లిం మత పెద్దలు, కార్పొరేటర్ సైఫుల్లా బేగ్, ఐఎంఎం బాషా, రఫి, వలి, ఇమాం, రియాజ్, అల్లీపీరా పాల్గొన్నారు.

'ప్రొటోకాల్ పాటించడం లేదు'



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఎంపీపీ హేమలత, వైస్ ఎంపీపీ విజయకుమార్

అనంతపురం అర్బన్: ఆత్మకూరు మండలంలో కొందరు అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించే క్రమంలో ప్రొటోకాల్ పాటించడం లేదని ఎంపీపీ సుబ్బర హేమలత అన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ వినోద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లేందుకు సోమవారం ఆమెతో పాటు వైస్ ఎంపీపీ విజయ కుమార్, ఎంపీటీసీ పోతులయ్య, ముట్టాల సర్పంచ్ తిరుపాలమ్మ, వడ్డుపల్లి సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, తదితరులు కలెక్టరేట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఈనెల 5వ తేదీన గొరిదిండ్ల, తోపుదుర్తి గ్రామాల్లో నూతన సబ్‌స్టేషన్ల భూమిపూజ, బీటీ రోడ్డు నిర్మాణ పనుల భూమిపూజ కార్యక్రమానికి తమను అధికారులు ఆహ్వానించలేదన్నారు. ప్రభుత్వ నిధులతో జరిగే కార్యక్రమాలపై ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు సమాచారం ఇవ్వడం లేదని మండిపడ్డారు. ప్రజాప్రతినిధులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను అధికారులు విస్మరించడం బాధాకరమన్నారు. అలాగే మదిగుబ్బ, బి.యాలేరు, సనప, తోపుదుర్తి, తదితర గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై కూటమి నాయకులు దాడులకు తెగబడుతున్నారని చెప్పారు. వీరిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పంచాయతీ పరిధిలో జరిగిన పనులకు సంబంధించి బిల్లులను టీడీపీ నాయకులు చెప్పిన వాటికే చేస్తున్నారని తెలిపారు. ఆత్మకూరు పంచాయతీలో ఎస్‌డీపీ కింద 2021–22 ఆర్థిక సంవత్సరంలో చేసి పనులకు బిల్లులు మంజూరు కాలేదన్నారు.

ఆదర్శప్రాయుడు చెన్నుపాటి లక్ష్మయ్య



చెన్నుపాటి లక్ష్మయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సమస్యలు, హక్కుల కోసం నిరంతరం శ్రమించిన కృషీవలుడు చెన్నుపాటి లక్ష్మయ్య అని ఏపీటీఎఫ్ నాయకులు కొనియాడారు. చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, రాష్ట్ర మాజీ కార్యదర్శి బి.నరసింహులు మాట్లాడుతూ.. ఏపీటీఎఫ్ ఉద్యమ నిర్మాత, ఉపాధ్యాయ సంక్షేమం కోసం, సమ సమాజం కోసం చెన్నుపాటి లక్ష్మయ్య నిరంతరం శ్రమించారన్నారు. నాలుగు దశాబ్దాలకు పైబడి విద్య ఉపాధ్యాయ రంగ అభ్యున్నతికి రాజీలేని పోరాటాలు చేశారన్నారు. బడుగు బలహీన గ్రామీణ వర్గాల విద్యార్థుల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయన జీవిత పాఠాలు ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సతీష్ కుమార్, జిల్లా కార్యదర్శి నరేష్, రాష్ట్ర కౌన్సిలర్ సర్దార్‌వలి, నాయకులు రమణ, వన్నప్ప, గోరంట్ల శ్రీనివాసులు, హనుమంతు, మదన్, ఓబులేసు, ఆంజనేయులు, రంగనాయకులు పాల్గొన్నారు.



రికార్డు రూంలో ఉన్న కీలకమైన డాక్యుమెంట్లు



ఫర్నీచర్ బయట పడేసిన దృశ్యం

అపరిశుభ్రంగా రికార్డ్ రూం

నగరపాలక సంస్థలోని రెవెన్యూ రికార్డు రూం అధ్వానంగా తయారైంది. గత రెండు నెలలుగా ప్యాచ్ వర్క్ పనులు జరుగుతూనే ఉన్నాయి. ఆ విభాగంలోని కీలక ఫైళ్లు తుప్పుపడుతున్నాయి. బూత్‌బంగ్లా తరహాలో కిటికీలకు బూజు పట్టింది. నగరపాలక సంస్థలోని కార్యాలయంలోనే ఈ పరిస్థితి ఉంటే ఇక నగరంలో పారిశుధ్యం మెరుగుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో అర్థం కావడం లేదు. వాస్తవంగా నగర పాలక సంస్థ ఏర్పడినప్పటి నుంచి రెవెన్యూ విభాగానికి సంబంధించిన ఫైళ్లు అన్నీ అక్కడే ఉన్నాయి. డిమాండ్ ఎక్స్‌ట్రాక్షన్, టైటిల్ ట్రాన్స్‌ఫర్, తదితర వాటి కోసం దరఖాస్తు చేసుకున్న వారు రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా అందులోని ఫర్నీచర్ కూడా బయట పడేశారు. రికార్డు రూం వద్ద కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. నగరపాలక సంస్థలోనే ఈ పరిస్థితి ఉంటే ఇక వీధుల్లో కుక్కల నియంత్రణకు అధికారులు ఏపాటి చర్యలు తీసుకుంటున్నారో అర్థం చేసుకోవాలి.

– అనంతపురం కార్పొరేషన్:

మినరల్ వాటర్ ప్లాంట్ సీజ్



నందిని మినరల్ వాటర్ ప్లాంట్‌ను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

అనంతపురం: ఉప్పరపల్లి గ్రామంలోని నందిని మినరల్ వాటర్ ప్లాంట్‌ను సోమవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాటర్ ప్లాంట్ లైసెన్స్, ప్లాంట్ శుభ్రత, ప్యాకింగ్ చేసే విధానం, నీటి నాణ్యతను పరిశీలించారు. నీటి నాణ్యతను పరిశీలించేందుకు నీటి నమూనాలను ఫుడ్‌సేఫ్టీ అధికారులతో సేకరించి, హైదరాబాద్ ల్యాబ్‌కు పంపారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మాట్లాడుతూ.. పంచాయతీ ట్రేడ్ లైసెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్, పురుగు మందుల అవశేషాలు లేని సర్టిఫికెట్, ప్రజారోగ్యశాఖ సర్టిఫికెట్, ప్రజారోగ్య శబూఖ సర్టిఫికెట్, భూగర్భ, జల శాఖ సర్టిఫికెట్, పరిశ్రమల శాఖ ఎన్‌ఓసీ, తూనికల, కొలతల శాఖ ప్యాకింగ్ లైసెన్స్ పొందకుండా వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తనిఖీ సమయంలో పలు సంస్థల యొక్క నకిలీ ట్రేడ్ మార్క్ ,లేబుల్‌ను ఉపయోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. ప్యాకింగ్ లైసెన్స్ పొందుకుండా ఫిల్లింగ్, ప్యాకింగ్, సీలింగ్ మాన్యువల్‌గా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తయారీ తేదీని ఏ లేబుల్‌పై ముద్రించలేదని పేర్కొన్నారు. ల్యాబొరేటరీ టెస్టింగ్, స్టాక్స్, సేల్స్ వాటి కోసం రిజిస్టర్లు నిర్వహించలేదన్నారు. వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేసి తదుపరి చర్యల నిమిత్తం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) అధికారికి నివేదించారు. కార్యక్రమంలో విజిలెన్స్ డీఎస్పీ ఎం.నాగభూషణం, సీఐ జమాల్ బాష, ఏఓ వాసు ప్రకాష్, డీసీటీఓ డి.విజయలక్ష్మి, ఏఈఈ టి.రాజశేఖర్, ఫుడ్ సేఫ్టీ అధికారి తస్లీం, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ గౌస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

16 నుంచి ధనుర్మాస వ్రతాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జ్వాలాపురం శ్రీకాంత్

అనంతపురం కల్చరల్: మార్గశిరంలో సాగే ధనుర్మాస వ్రతాల్లో భక్తులు పాల్గొనాలని మాజీ ప్రభుత్వ సలహాదారుడు (ఎండోమెంట్) జ్వాలాపురం శ్రీకాంత్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి జనవరి 13 వరకు సాగే ధనుర్మాస వ్రతాలు, గోదా రంగనాథ తిరు కల్యాణ వేడుకల ఆహ్వాన పత్రికలు, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోనే ఏకైక శ్రీక్షేత్రం (లక్ష్మీ హయగ్రీవ లక్ష్మీ వేంకటేశ్వర, గోదారంగనాథ స్వామి దేవస్థానం) వేదికగా రోజూ ఉదయం 5 గంటలకే అభిషేకాలు, ధనుర్మాస పూజలు, తిరుప్పావై, తిరుప్పల్లాండ్ పఠనం జరుగుతాయన్నారు. అలాగే సాయంత్రం లక్ష్మీ అష్టోత్తరం, విష్ణుసహస్రనామ పారాయణం, గోదాదేవి అష్టోత్తర సహిత తిరుప్పావై పారాయణం ప్రముఖ సంగీత నాట్యాచార్యులు సంధ్యామూర్తి నేతృత్వంలో జరుగుతాయన్నారు. అలాగే నిత్యం సంగీత విభావరి, ప్రసాద వితరణ ఉంటాయని పేర్కొన్నారు. జనవరి 13న గోదాదేవి రంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అంబళం రఘునాథ్, శేషాచార్యులు, రాళ్లపల్లి లక్ష్మణ్, రంగభరణి, హరిప్రియ, విష్ణుప్రియ, చేతన తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికను కాపాడాలి



సమస్య తెలిపేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన బెస్త సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: రాయదుర్గం పట్టణ సమీపంలోని బెస్త సామాజిక వర్గానికి చెందిన శ్మశాన వాటిక ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని బెస్త సేవా సంఘం నాయకులు విన్నవించారు. కలెక్టర్ వి.వినోద్ కుమార్‌ను కలిసి తమ సమస్యను చెప్పుకునేందుకు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా బెస్త సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ మాట్లాడుతూ.. రాయదుర్గం పట్టణానికి సమీపంలోని సర్వే నంబర్ 11–1లోని కొండ పోరంబోకు స్థలాన్ని శ్మశాన వాటికగా గత వందేళ్లగా బెస్త సామాజిక వర్గం ఉపయోగించుకుంటోందన్నారు. అయితే దేవాలయం నిర్మాణం పేరుతో ఈ స్థలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నిస్తూ శ్మశానాన్ని జేసీబీలతో శుభ్రం చేస్తున్నారన్నారు. గతంలో తహసీల్దార్ విచారణ చేసి ఈ స్థలం బెస్త సామాజిక వర్గానికి చెందినదేనని నిర్ధారిస్తూ నివేదికను కలెక్టర్‌కు సమర్పించారని తెలిపారు. ఈ స్థలం అన్యాక్రాంతం అయితే బెస్తలు శ్మశాన వాటిక కోల్పోవాల్సివస్తుందన్నారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి స్థలాన్ని కాపాడాలని కోరామన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు శేషాద్రిణ, కోశాధికారి నాగేంద్ర, కార్యదర్శి కుళ్లాయప్ప, రాయదుర్గం సంఘం నాయకులు శ్రీరాములు, గోవిందు, కమలమ్మ, పాల్గొన్నారు.

కృత్రిమ గర్భధారణతో ప్రయోజనాలు



పాడి పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

రాప్తాడు: కృత్రిమ గర్భదారణ ప్రక్రియతో పాడి రైతులకు బహుళ ప్రయోజనాలున్నాయని పశుగణాభివృద్ధి సంస్థ జిల్లా కార్యనిర్వహణాధికారి టి.వి.సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని యర్రగుంట గ్రామంలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భదారణ చేయు పాడి పశువుల ఎన్నికకు రైతులకు అవగాహన కల్పించడం, మంచి పశువులను ఎంపిక చేయడానికి ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. లింగ నిర్ధారిత వీర్యం సూదులను ప్రభుత్వమే సరఫరా చేస్తుందని పేర్కొన్నారు. ఈ వీర్యం వలన 90 శాతం పెయ్య దూడలే జన్మిస్తాయని తెలిపారు. విదేశీ జాతుల దూడలే కాక స్వదేశీ జాతులైన గిర్, సాహివాల్, తార్పర్కార్ వంటి జాతుల దూడల బ్రీడ్‌ను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. భవిష్యత్తులో ఈ లింగ నిర్ధారిత వీర్యం అత్యధిక ప్రాచుర్యం పొందుతుందని పేర్కొన్నారు. అనంతరం పాడి పశువులకు గర్భకోశ పరీక్షలు చేసి, నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో ఏడీ ప్రకాష్, పశు వైద్య సిబ్బంది, గోపాల మిత్ర పాల్గొన్నారు.

డీలర్‌పై చర్యలు తీసుకోండి

రాప్తాడు రూరల్: తక్కువ తూకాలు వేస్తూ లబ్ధిదారుల కడుపు కొడుతున్న అనంతపురం రూరల్ మండలం విద్యారణ్యనగర్ ఉర్దూ స్కూల్ సమీపంలోని రేషన్‌షాపు డీలర్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు. సోమవారం మండలస్థాయి గ్రీవెన్స్‌లో రూరల్ తహసీల్దార్ మోహన్ కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర మాజీ కార్యదర్శి చిలమకూరి వెంకటస్వామి మాట్లాడుతూ.. 15 కేజీలకు గాను 10.5 కేజీలు, 20 కేజీలకు గాను 16 కేజీల మాత్రమే బియ్యం వేస్తున్నారన్నారు. ఇటీవల పలువురు మహిళలు ఆర్డీఓను కలిసి ఫిర్యాదు చేశారన్నారు. తహసీల్దార్ స్పందిస్తూ.. లబ్ధిదారులను విచారించి పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలంటూ సీఎస్‌డీటీ ఇంతియాజ్ అహమ్మద్‌ను ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ నిత్యావసర సరుకులను లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందజేయాలని ఆదేశించారు. తూకాల్లో మోసం చేసినా, సరుకులు ఇవ్వకపోయినా డీలర్లపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడే డీలర్లపై ప్రజలు నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. వచ్చే ఫిర్యాదులపై విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

హంద్రీ-నీవా కాలువ వెడల్పు చేయాలి




కలెక్టర్ వినోద్ కుమార్‌కు సమస్యను విన్నవిస్తున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి మల్లికార్జున

అనంతపురం అర్బన్: హంద్రీ–నీవా కాలువకు లైనింగ్ ప్రధానం కాదు. రైతుల ప్రయోజనాల కోసం కాలువను 10 వేల క్యూసెక్కుల సామర్థ్యానికి వెడల్పు చేసి ఆయకట్టుకు నీరివ్వాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్‌కు రైతు సంఘం నాయకులు విన్నవించారు. సోమవారం కలెక్టరేట్‌లోని నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున, ఇతర నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ.. జీడిపల్లి నుంచి లైనింగ్ చేయడం అంటే జిల్లా రైతులకు తీవ్ర అన్యాయం చేయడమే అవుతుందన్నారు. కాలువకు లైనింగ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఇప్పటి వరకు ఆయకట్టుకు నీరివ్వకుండా కేవలం కాలువకు ఇస్తున్నారని పేర్కొన్నారు. పిల్లకాలువలు కూడా ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. వస్తున్న నీటిని ముందుకు తీసుకుపోవడం అంటే జిల్లా ప్రజలకు అన్యాయం చేయడమే అన్నారు. కాలువ వెడల్పు పనులు చేపట్టాలన్నారు. లేని పక్షంలో రైతులను కలుపుకుని ఉద్యమాలకు శ్రీకారం చుడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, శ్రీకాంత్, నగేష్, ధనుంజయ, దుర్గాప్రసాద్, వెంకటరాముడు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

బైక్ అపహరణ

అనంతపురం: నగరంలోని ఆర్.కే.నగర్‌లో నివాసం ఉంటున్న కే.సర్దార్ నాయక్ కుమారుడు కే.బిందు సాగర్ నాయక్‌కు చెందిన బజాజ్–390 మోడల్ బైక్ అపహరణకు గురైనట్లు త్రీ టౌన్ సీఐ కే.శాంతిలాల్ తెలిపారు. ఈనెల 3వ తేదీన బైక్‌ను (ఏపీ37 సీక్యూ 8991) ఇంటి ముందు పార్కు చేశారు. మరుసటి రోజు ఉదయం 6:30 గంటలకు చూస్తే బైక్ కనిపించ లేదు. బైక్ విలువ సుమారు రూ.1,80,000 ఉంటుంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

వడ్డీ వ్యాపారుల దౌర్జన్యాలు అరికట్టాలి



ఎస్పీ జగదీష్‌కు ఫిర్యాదు చేసి బయటకు వస్తున్న ఎస్సీ, ఎస్టీ జేఏసీ సంఘాల నాయకులు

అనంతపురం: పేదల అవసరాలను ఆసరాగా తీసుకుని అధిక వడ్డీలకు అప్పులు ఇస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి కోరారు. అధిక వడ్డీ వ్యాపారస్తుల వేధింపులతో ఇబ్బందులు పడుతున్న బాధితులతో కలిసి సోమవారం ఎస్పీ జగదీష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ.. దినం , వారం, నెల వడ్డీలకు ఇస్తూ వేధింపులకు గురి చేస్తూ.. ఇళ్ల మీద పడి దాడులు చేయిస్తున్న మహిళా వడ్డీ వ్యాపారి ఆగడాలను అరికట్టాలన్నారు. తలారి నాగరాజు అతడి భార్యపై దాడి చేయించి తీవ్రంగా గాయపరిచిన సంఘటన గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ బిజినెస్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సాకే చిరంజీవి, రామకృష్ణ, వెంకటేశ్, గోపాల్, బాధితులు నాగేశ్వరి, లక్ష్మీదేవి, ఆదెమ్మ, మల్లీశ్వరి, నాగరాజు, బాబు పాల్గొన్నారు.